# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 184 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 04 జూన్ 2026 | పేజీలు : 5




**జాతీయ స్థాయిలో మెరిసిన వరంగల్ విద్యార్థి**

- ఎంసెట్లో 63, జేఈఈ అడ్వాన్స్డ్ లో 900వ ర్యాంకు

2

**మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీ కావ్య**



2 లో



## పక్కా యాక్షన్ ప్లాన్‌తో

# గ్రామ సభలు

- సభల్లో తెలియజేయాలిసిన అంశాల పైన అధికారులకు అవగాహన
- అందరూ సమన్వయంతో పని చేయాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం నుండి నిర్వహించనున్న గ్రామ, వార్డ్ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. ప్రజపాలన ప్రగతి ప్రణాళిక లో భాగం గా రేపటి నుండి నిర్వహించే గ్రామ, వార్డ్ సభల ఏర్పాట్ల మీద అలాగె అవగాహన కల్పించాలిసిన అంశాల మీద వివిధ శాఖల జిల్లా మండల, గ్రామ స్థాయి అధికారులు,మండల స్పెషల్ అధికారులు, గ్రామ సభ ల స్పెషల్ అధికారుల కి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ బుధవారం మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ....ఈ నెల 4, 6, 9, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు, వార్డు సభలను నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రామ, వార్డు సభలను పక్కాగా నిర్వహించి వివిధ అంశాల మీద ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పంటల మార్పిడి, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల పైన ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గురించి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ప్రధాన లక్ష్యం, ఎన్నికల సిబ్బంది విధులు, పౌరుల భాగస్వామ్యం, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై అవగాహన పెంచడం ద్వారా ప్రతి అర్హ పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడానికి సహకరించాలని అధికారులు కృషి చేయాలన్నారు. ఘన వ్యర్ధాల నిర్వహణ లో ఉన్న నిబంధనలను, గృహాల బాధ్యత, భారీ వ్యర్ధాల ఉత్పత్తి నిబంధనలు, స్థానిక సంస్థల పాత్ర, విస్తృత బాధ్యత,ల్యాండ్ ఫిల్స్ భవిష్యత్ తదితర అంశాల మీద సభల్లో ప్రజల కి అవగహన కల్పించాలన్నారు. రానున్న వర్ష కాల నేపథ్యంలో గ్రామీణ, పట్టణ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా, సీజనల్ వ్యాధుల నివారణ కోసం డ్రైనేజీల నిర్వహణ, వాటర్ ట్యాంక్ లను క్లీన్ గా పెట్టడం, దోమల నివారణకు డ్రై డే నిర్వహించడం, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం, శానిటేషన్ నిర్వహణ, వేడి నీరు తాగడం ఆవశ్యకత గురించి దండోరా వేయడం తదితర అంశాల మీద సభల్లో అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల మార్పిడి కి సంబందించి పప్పు దినుసులు, నూనె పంటల అవశ్యకత ను, జాతీయ ఎరువుల చట్టం, సాయిల్ ప్రిపరేషన్ కి అలాగే పంటల కోసం ఎరువులను ఎలా వాడాలన్నా అంశాల మీద తెలియజేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఎవెన్యూ, కమ్యూనిటీ ప్లాంట్ ఏర్పాటు ప్రాధాన్యత, ఇరిగేషన్ శాఖ అధికారులు వర్షాకాలంలో వరదలు సంభవిస్తే.. ప్రజలు పాటించాలిసిన నియమాలను, జాగ్రత్త లని తెలియజేయాలన్నారు. గ్రామ, వార్డు సభలలో ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కృషి చేయాలన్నారు. సభల నిర్వహణ కు నిర్ణీత షెడ్యూల్ తయారు చేసి, తదనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. సమావేశం లో అదనపు కలెక్టర్ బెన్ షా లోం, జడ్పీ సీఈఓ రంగారావు, ఆర్డీఓ లు గోపిరామ్, కిరణ్ ప్రకాష్,ఏసీపీ భీమ్ శర్మ వివిద శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు


**wanted**

**విలేకరులు కావలెను**



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# మహిళలను యజమానులుగా మార్చుతం

■ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ, మన చౌరాస్తా :** మహిళల ఆర్థిక సాధికారతే సమాజ అభివృద్ధికి బలమైన పునాదని, మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ జిల్లా మడికొండలోని మహిళా ప్రాంగణంలో డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సాధికారత కోసం రూ.1.50 కోట్లతో నిర్మించనున్న జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌కు స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా యజమానులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అవకాశాలు కల్పిస్తే మహిళలు వ్యాపారం, పరిశ్రమ, వ్యవసాయం, సేవారంగం సహా అన్ని రంగాల్లోనూ విజయాలు సాధించగలరని పేర్కొన్నారు. మడికొండలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు కావడం గర్వకారణమని, ఇది మహిళలకు స్థిరమైన ఆదాయ వనరుగా మారడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ కార్యక్రమాలు, సోలార్ రంగం తదితర విభాగాల్లో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి వారి ఆదాయ వనరులు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, చాహత్ బాజ్ పాయ్, డీఈడీఓ శ్రీనివాస్, బీపీసీఎల్ ప్రతినిధులు, ఐకేపీ రీజినల్ కోఆర్డినేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లపై నిఘా పెంచాలి

■ వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్, మన చౌరాస్తా :** భూ వివాదాలు, సెటిల్‌మెంట్ల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కేయూసీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ పనితీరు, రికార్డులు, నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. స్టేషన్ పరిసరాలు, కేసు ప్రాపర్టీ గదులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం రౌడీ షీటర్లు, అనుమానితుల వివరాలను సమీక్షించి, యాక్టివ్‌గా ఉన్న వారి కదలికలపై ఆరా తీశారు. రౌడీ షీటర్ల పట్ల సానుభూతి చూపవద్దని, బెదిరింపులు, అక్రమ సెటిల్‌మెంట్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సామాజిక సమస్యలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్ఐలు తమ సెక్టార్‌లలో నేరాల నియంత్రణతో పాటు ముందస్తు సమాచార సేకరణపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ దారా కవిత, ఏసీపీ నర్సింహారావు, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంచిన పల్లా

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ పట్టణంలోని మూడో వార్డుకు చెందిన పెద్దగోని సంధ్య, చింత అనితలకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వం, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అవసర సమయంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలు, కౌన్సిలర్ బూడిది జ్యోతి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, పార్టీ నాయకుడు ఉల్లింగల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరు బడులకు ప్రీప్రైమరీ సెక్షన్లు మంజూరు

**జనగామ, మన చౌరాస్తా:** జనగామ మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలలకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి ప్రీప్రైమరీ సెక్షన్లు మంజూరైనట్లు మండల విద్యాశాఖ అధికారి గురిజాల శంకర్ రెడ్డి తెలిపారు. గణేష్‌వాడ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు వడ్లకొండ, పెంబర్తి, షామీర్‌పేట, ఓబుల్‌కేశాపూర్, వెంకిర్యాల ప్రాథమిక పాఠశాలల్లో ఈ సెక్షన్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పాఠశాలకు ఒక టీచర్, ఒక ఆయా పోస్టును మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. టీచర్ పోస్టుకు ఇంటర్మీడియట్‌తో పాటు డిప్లొమా అర్హత, ఆయా పోస్టుకు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణత ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 5వ తేదీలోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.






# జాతీయ స్థాయిలో మెరిసిన వరంగల్ విద్యార్థి శ్రీవర్ధన్

### – ఎంసెట్లో 63, జేఈఈ అడ్వాన్స్డ్‌లో 900వ ర్యాంకు

**వరంగల్, మన చౌరాస్తా:** వరంగల్ జిల్లా కాశిబుగ్గకు చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన విద్యార్థి సాంబారి శ్రీవర్ధన్ జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రశంసలు అందుకుంటున్నాడు. ఎంసెట్-2026లో 63వ ర్యాంక్, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓపెన్ కేటగిరీలో 900వ ర్యాంక్, జేఈఈ మెయిన్స్‌లో 1258వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటుకున్నాడు. సాంబారి కల్పన-చంద్రమోహన్ దంపతుల పెద్ద కుమారుడైన శ్రీ వర్ధన్ సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చాడు. తండ్రి చంద్రమోహన్ వరంగల్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో గుమస్తాగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన అతని ప్రతిభను గుర్తించిన నారాయణ విద్యాసంస్థలు హైదరాబాద్‌లోని అన్నోజిగూడ సింగపూర్ సిటీ బ్రాంచ్‌లో రెండేళ్లపాటు ఉచితంగా ఇంటర్మీడియట్ విద్యను అందించాయి. ఇంటర్మీడియట్ అనంతరం పోటీ పరీక్షల్లోనూ శ్రీ వర్ధన్ సత్తా చాటాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఓబీసీ కేటగిరీలో 154వ ర్యాంక్, జేఈఈ మెయిన్స్‌లో ఓబీసీ కేటగిరీలో 220వ ర్యాంక్ సాధించాడు. శ్రీ వర్ధన్ విజయంపై నారాయణ విద్యాసంస్థల అన్నోజిగూడ క్యాంపస్ కోఆర్డినేటర్ చెరుకు రఘుపతి రెడ్డి, ఏజీఎంలు పి. అరుణ్ కుమార్, అనిల్ గవాస్కర్ అభినందనలు తెలిపారు. తమ కుమారుడి విజయానికి నారాయణ విద్యాసంస్థల సహకారం ఎంతో దోహదపడిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీవర్ధన్‌ను అభినందిస్తూ, అతని ప్రతిభను గుర్తించి ఉచిత విద్య అందించిన నారాయణ విద్యాసంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని పేర్కొన్నారు.




# ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

### – గౌట్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ పావని కుమారి

జనగామ, మన చౌరాస్తా: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి కాలుష్య నివారణకు కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్మకంచ ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, పోస్టర్లను విడుదల చేసి విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ పావని కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా "వన్ ఎర్త్, వన్ చాన్స్" నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవిప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

## – జనగామ ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్

**జనగామ, మన చౌరాస్తా:** మహిళలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. జనగామ మండలం మరిగడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు పావలా వడ్డీ రుణాలు, సబ్సిడీపై ఎరువుల దుకాణాలు, రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు వంటి రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రం ద్వారా వడ్లు, విత్తనాలు, పురుగుమందులు తదితర వ్యవసాయ అవసరాలను పొందుతూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్, సర్పంచ్ కర్రె పరశురాములు, ఏఎంసీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్, ఏపీఎం శంకరయ్య, సీసీ స్వప్న, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎంజీఎం నాణ్యమైన సేవలు

# అందేలా కృషి చేయాలి

■ **మంత్రి కొండా సురేఖ**

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, కుడా చైర్మన్ ఏనుగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంజీఎం ఆసుపత్రిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతుల మెరుగుదల, వైద్య సదుపాయాల విస్తరణపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్రారెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.










Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**